వరించిన ఊట

గంగలో ఊటనీరొచ్చింది.. ఎడగారు సాగుకు ఊతమొచ్చింది. అన్నదాతల్లో ఆశలు చిగురించాయి.. ఫలితంగా కర్షకులు హలాలు పట్టి పొలం దున్ని పైరు పెడుతున్నారు. దీంతో కనుచూపు మేర దమ్ము చేసిన పొలాలు దర్శనమిస్తున్నాయి. ఎడగారు వరి అంచనాలకు మించి సాగు అవుతోంది. నేటికీ వరినాట్లు సాగుతున్నాయి.



శిరుణంబూదూరు సమీపంలోని గంగ కాలువలో ఊటనీరు

- గంగ ఊటతో చిగురించిన ఆశలు
- వరి సాగులో బిజీబిజీగా రైతులు

సత్యవేడు: మండలంలోని శిరుణంబూదూరు కర్షకులకు తెలుగుగంగ ఊటనీరు వరంలా మారింది. ఈ క్రమంలో ఆ గ్రామంలోని పుడమిపుత్రులు వరి సాగుకు సమాయత్తమవుతున్నారు. మండలంలోని శిరుణంబూదూరు సమీపంలో తెలుగుగంగ కాలువ ఉంది. ప్రస్తుతం గంగ కాలువలో ఊటనీరు సమృద్ధిగా ఉంటోంది. గంగ కాలువలో ఉన్న ఊటనీరు పంట సాగుకు సరిపోతుందన్న నమ్మకంతో రైతులు ఎడగారు సాగుకు సిద్ధమవుతున్నారు. రబీలో వరి కోతలు కోసిన రైతులకు నీటి వసతి ఉండడంతో రెండోపంటగా ఎడగారు సాగుకు వారం రోజు లుగా ట్రాక్టర్లతో దుక్కులు దున్నుతూ బిజీబిజీగా ఉన్నారు. బాగా దమ్ము చేసిన పొలాల్లో ఎద్దులతో కర్రమాను తోలి పొలం చదును చేస్తున్నారు. ముందుగా నానబెట్టి మొలకలు వచ్చిన 'చిన్న బుడ్డలు' విత్తనాలను వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్నారు.

చిన్నబుడ్డలకు అధిక డిమాండ్

చిన్న బుడ్డల రకం ధాన్యానికి పొరుగు రాష్ట్రమైన తమి ళనాడులో అధిక డిమాండ్ ఉంది. ఈ రకం బియ్యం ఇడ్లీకి ఎక్కువగా వాడుతారు. ఈ క్రమంలో తమిళనాడు వ్యాపారులు ఇక్కడికే వచ్చి ధాన్యం కొనుగోలుకు మొగ్గు చూపుతారు. దీనికితోడు ఈ రకం వరి పంట కేవలం 90 రోజులకే పంట దిగుబడి వస్తుంది. ఈ నేపథ్యంలో రైతులు ఆ రకం వరి సాగుపై మొగ్గు చూపుతున్నారు. శిరుణంబూదూరులో సుమారు 35 మంది రైతులు చిన్న, సన్నకారు రైతులు ఉన్నారు. వీరికి 85 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ విస్తీర్ణంలో ఇప్పటివరకు 30 ఎకరాల్లో చిన్నబుడ్డల రకం వరి సాగు చేశారు. ఇంకా మరో 30 ఎకరాల్లో సాగు చేయనున్నారు.



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు



కర్రమానుతోలి పొల్లం చదును చేస్తున్న కూలీలు



విత్తనం వెదజల్లుతున్న కర్షకుడు

ఎరువుల యాజమాన్యం తప్పనిసరి



వరి పంట సాగు చేస్తున్న రైతులు ఎరువుల యాజమాన్యం తప్పనిసరిగా పాటించాలని ఏఓ మురళి సూచించారు. ప్రస్తుతం వరి విత్తనాలు వెదజల్లుతున్న రైతులు దుక్కి ఎకరాకు రెండు బస్తాలు డీఏపీ, యూరియా, పొటాష్ అర బస్తా వంతున వేయాలి. పొలంలో విత్తనం వెదజల్లిన మూడు నుంచి ఐదు రోజులోపు వైరజో సల్ఫూరిక్ ఇ. థాల్ 120 లీటరు నీటిలో కలిపి 20 కేజీల ఇసుక మిశ్రమం చేసి పొలంలో చల్లాలి.

-మురళి, ఏఓ, సత్యవేడు మండలం

కాలువలో నీరుంటే పంట పండినట్లే



మా ఊరికి సమీపంలో ఉన్న తెలుగు గంగ కాలువలో ఊట నీరు చేరితే పంటకు సాగు నీటి బెంగ లేదు. ఊట నీరు మూడు నెలల పంటకు సరిపోతుంది. కాలువలో నీరు వృథా చేయకుండా పంటకు కావాల్సినంతే వినియోగిస్తాం. వేసవిలో పంటకు అవసరమైన తడులు కట్టి పంట పండిస్తాం.

- కన్నాయిరం, శిరునంబూదురు, సత్యవేడు.

గంగతో తీరిన నీటి బెంగ



మా ఊర్లోని చెరువులో పంటలకు సరిపడే నీళ్లు ఉండేది కాదు. తమిళనాడుకు నీరు ఇచ్చేందుకు తెలుగుగంగ కాలువ తవ్వారు. అప్పటి నుంచి కాలువలో ఊటనీరు ఉంటోంది. కాలువలో ఊట నీరుంటే బావుల్లో, బోర్లులో నీరు ఉంటోంది. పొలాలకు కావాల్సిన ఊటనీరు ఉండడంతో రెండో పంట సాగు చేస్తున్నాం.

- మురుగేశన్, శిరుణంబూదూరు, సత్యవేడు మండలం

క్లుప్తంగా

చిన్నారులకు పుస్తెల భారం వద్దు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి: చిన్నవయసులో పుస్తెల భారం వద్దని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం బాల్యవివాహాల వ్యతిరేకపోరాట సమితి నాయకులు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నవయసులో పుస్తెల భారం వద్దని చదువే ముద్దు అన్నారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో స్వామి అమ్మవార్ల కల్యాణం రోజున బాల్యవివాహాలు జరగకుండా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పుల్లయ్య, కోటయ్య, గురవయ్య, మణి, గోపి, చారులత పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు 255 మంది హాజరు



అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు ఆధ్వర్యంలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని 300 మంది దరఖాస్తు చేసుకోగా 255 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. స్టేట్ బ్యాంకు సిబ్బంది ఇంటర్వ్యూలకు రాకపోవడంతో అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. 29 యూనిట్లకు 300 మంది దరఖాస్తు చేసుకోవడం ఒక్కో యూనిట్‌కు 10 మంది పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ వెంకటరమణ, ఫీల్డ్ ఆఫీసర్ రవి, పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



గణపతి హోమం చేస్తున్న అర్చకులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం కుర్ర కాలవ గ్రామంలోని అభయ వరసిద్ధి వినాయకస్వామి దేవాలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం తెల్లవారుజామున ప్రధాన అర్చకులు గంటి శ్రీనివాసశర్మ, మణికంఠ శర్మ స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. రాత్రి 7 గంటలకు గ్రామస్తులు ఆధ్వర్యంలో గణపతి హోమం జరిపారు. మాజీ సర్పంచ్ రాణమ్మ, వేణు ముదిరాజ్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. గణపతి హోమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న వైద్యాధికారి లావణ్య

వరదయ్యపాళెం: ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లావణ్య తెలిపారు. బుధవారం మండలంలోని కంచరపాళెంలో మోండలెజ్ బాలరక్ష భారత్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి లావణ్య మాట్లాడుతూ రోగులు ముందస్తుగా వైద్యులను సంప్రదిస్తే ఎలాంటి జబ్బునైనా నయం చేసుకునేందుకు వీలుంటుందన్నారు. గర్భిణులు, బాలింతలు, కౌమార దశ దాటిన వారు, వృద్ధులు నిత్య జీవితంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బాలరక్ష ప్రాజెక్ట్ మేనేజర్ డానియల్, ఎంపీహెచ్ఓ రవీంద్రుడు, సూపర్‌వైజర్ పవనకుమారి, ఏఎన్ఎం కామేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ బేబి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరునికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు అందజేస్తున్న గురుప్రసాద్ దంపతులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారికి బుధవారం మదనపల్లెకు చెందిన రాటకొండ గురుప్రసాద్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. వీటిని ఈఓ బాపిరెడ్డి స్వీకరించి, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శనం ఏర్పాటు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పట్టువస్త్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్



నిరసన తెలుపుత్ను వామపక్ష నాయకులు

శ్రీకాళహస్తి: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజావ్యతిరేకంగా ఉందని, పేద, మధ్యతరగతి, కార్మికులు కడుపు కొట్టేలా ఉందని వామపక్ష నాయకులు అన్నారు. కేంద్ర వామపక్ష కమిటీ పిలుపు మేరకు బుధవారం పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బడ్జెట్ కేవలం కార్పొరేట్లకు మాత్రమే లాభం చేకూర్చేలా ఉందన్నారు. ప్రజలకు లబ్ధి చేకూర్చేలా మళ్లీ రూపకల్పన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య, గురవయ్య, శివకుమార్, కోటయ్య, గోపి, చారులత పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు వినియోగించుకోవాలి



అంగన్‌వాడీ కార్యకర్తలకు సామగ్రి అందజేస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: అంగన్‌వాడీ కార్యకర్తలు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని క్షేత్ర స్థాయిలో అమలు చేసి పిల్లల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని సీడీపీఓ దేవకుమారి తెలిపారు. బుధవారం బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి రెండో రోజు శిక్షణ తరగతులకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ తరగతులకు కార్యకర్తలు క్రమం తప్పకుండా హాజరుకావాలని తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలన్నారు. అనంతరం ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం విరాళంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు నోట్ బుక్స్, పెన్, ఫైళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీలు, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, సూపర్‌వైజర్ యమున పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ హిందీ భాష మాట్లాడాలి



తెనాలి రామకృష్ణ నాటకంలో పాల్గొన్న విద్యార్థులు



హిందీ భాషోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

సత్యవేడు: జాతీయ భాష అయిన హిందీని ప్రతి విద్యార్థి సరళంగా మాట్లాడేలా నేర్చుకోవాలని హెచ్ఎం భారతి సూచించారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో హిందీ భాషోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెనాలి రామకృష్ణ నాటకం, గేయాలు హిందీలో ఆలపించారు. పదో తరగతిలో హిందీలో వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మనోహర్, అన్వర్ బాషా, రఫీ, బాలాజీ, రాజేష్, సూర్యకుమార్, సుబ్బరాయుడు, వైవీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా హిందీ భాషోత్సవం

బుచ్చినాయుడుకండ్రిగ: భారతీయ భాషోత్సవాల్లో భాగంగా బుధవారం నెలవాయి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో హిందీ భాషోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రవీంద్రరెడ్డి మాట్లాడుతూ జాతీయ భాష హిందీని త్రిభాషా సూత్రంలో భాగంగా నేర్చుకుంటున్నామని తెలిపారు. అనంతరం హిందీ భాష పోటీలు నిర్వహించి పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పురుషోత్తం పాల్గొన్నారు.

శివయ్యా.. ఏమిటీ దుస్థితి

- చెత్తకుప్పులో బ్రహ్మోత్సవ పోస్టర్లు



చెత్తకుప్పలో దర్శనమిస్తున్న శివరాత్రి వాల్‌పోస్టర్లు

శ్రీకాళహస్తి: ముక్కంటీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవ పోస్టర్లు చెత్తబుట్టలో ఎక్కడ పడితే అక్కడ కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. ఆలయాధికారులు పదిరోజుల ముందు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి, ఇతర రాష్ట్రాలు, రాష్ట్రంలోని పలు పుణ్యక్షేత్రాల్లో అతికించాల్సి ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకోకుండా వాల్‌పోస్టర్లను విడుదల చేసే ప్రక్రియను పక్కన పెట్టి వీఐపీలకు ఆహ్వానపత్రికలు అందజేయడంలోనే తలమునకలయ్యారు. దీనిపై సాక్షిదినపత్రికలో కథనాలు ప్రచురితం కావడంతో మంగళవారం రాత్రి ఎవరికో కాంట్రాక్టు ఇచ్చి గోడలపై అతికించమన్నారు. ఆ కాంట్రాక్టర్లు ఎక్కడ గోడ కనిపిస్తే వంద, 200 అతికించి మిగిలినవి చెత్తబుట్టలో పడేసి వెళ్లిపోయారు. దీన్ని చూసిన భక్తులు శివయ్యా.. నీ ఏమిటి దుస్థితి అంటున్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత ఆలయాధికారులపై ఉంది. బ్రహ్మోత్సవ పోస్టర్ల విషయంలో ఇంత నిర్లక్ష్యం తగదని భక్తులు ఆరోపిస్తున్నారు.

మంత్రి లోకేష్‌కు సాదర స్వాగతం

రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్): తిరుపతి పర్యటన నిమిత్తం బుధవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు అధికారులు, ఎమ్మెల్యేలు సాదర స్వాగతం పలికారు. మంత్రి వెంట తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఉన్నారు. స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర రవాణా శాఖ, యువజన శాఖ మంత్రి రాంప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, కోనేటి ఆదిమూలం, బీజేపీ నేత భానుప్రకాష్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వీసీ ఉమ, ఆర్టీఓ భానుప్రకాష్ రెడ్డి ఉన్నారు. అనంతరం రోడ్డు మార్గంలో తిరుపతికి వెళ్లారు. తిరుపతి కార్యక్రమాలు ముగించుకొని రాత్రి రేణిగుంట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ గన్నవరానికి వెళ్లారు.

21న ఇంటర్వ్యూలు

సత్యవేడు: స్వయం ఉపాధి యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 21వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. బీసీ కార్పొరేషన్ 2024-25 సంవత్సరానికి సంబంధించి స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన కోరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. స్టేట్ బ్యాంక్, కెనరా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ శ్రీసిటీ, గ్రామీణ బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూల్లో పాల్గొంటారన్నారు.

సులభ రీతిలో బోధించాలి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): విద్యార్థులకు అర్థమయ్యేలా సులభరీతిలో విద్యాబోధన చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎంఈఓ రంగనాథన్ సూచించారు. రేణిగుంట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరురోజుల శిక్షణ కార్యక్రమం జరుగుతోంది. ఈ శిక్షణ తరగతులు ను బుధవారం సమగ్ర శిక్ష స్టాఫ్ మధు, సారథి పరిశీలించారు. ఎంఈఓ రంగనాథన్ శిక్షణలో పాల్గొని మాట్లాడారు. విద్యకు సంబంధించి ప్రభుత్వం సరఫరా చేస్తున్న బోధనాభ్యసన సామగ్రితో పిల్లలకు సులభరీతిలో అర్థమయ్యేలా ఆట పాటలతో విద్యాబోధన చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముక్కంటి సేవలో కేంద్ర సహాయమంత్రి



కేంద్రమంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఈఓ బాపిరెడ్డి, వేదపండితులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు మంత్రిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

చలువ పందిరి ఏర్పాటు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ సమీపంలోని దేవాంగుల వాహన మండపం వద్ద దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాపందిరిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, జయరామయ్య, నాగయ్య, సుబ్రహ్మణ్యం,వెంకటేశ్వర్లు, రవీంద్రబాబు, ప్రసూన ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



విశేషాలంకరణలో పార్వతీ దేవి

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలోని పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ధ్వజారోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేక హోమాలు, పూజలు చేసి, ధ్వజపటాన్ని ఎగురవేసి, ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మహాదీపారాధన, ఐదు గంటలకు యాగశాల పూజ, సాయంత్రం మూలవర్లకు అభిషేకం చేశారు. అనంతరం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ చేసి పల్లకిలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. కోలాట ప్రదర్శనలు, వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ వాహన సేవ కనువిందుగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. పల్లకి సేవకు మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్ర నాయుడు , వారి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వాహణ అధికారి లత, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త సామ్రాజ్‌కు నూకతోటి పరామర్శ



రామచంద్రన్‌కు నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

నాగలాపురం: వైఎస్సార్ సీపీ కార్యకర్త సామ్రాజ్‌ను ఆ పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూతకతోటి రాజేష్ బుధవారం పరామర్శించారు. సామ్రాజ్ తండ్రి రామచంద్రన్ మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి సామ్రాజ్ ఇంటికి వెళ్లి రామచంద్రన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సామ్రాజ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు మండల అధ్యక్షులు అపరంజిరాజు, మేజర్ పంచాయతీ సర్పంచ్ చిన్నదొరై సుధ, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



ఛత్రపతి శివాజీకి నివాళులర్పిస్తున్న నేతలు

శ్రీకాళహస్తి: పట్టణంలో శ్రీకాళహస్తి ఆరే మరాఠా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనార్దన్‌రావ్ పవార్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ స్వరాజ్యం కోసం ఎంతో పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పదోలకర్ సత్యనారాయణ, ఉమేష్‌రావు మోరె, మహేశ్వరరావు, భాస్కర్‌రావు, దయానందరావు, సదారాం, హరిరావు, ప్రసన్నకుమార్, గోవర్ధనరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: పట్టణంలో బుధవారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. బీజేపీ, వీహెచ్‌పీ, ఆర్ఎస్ ఎస్, భజరంగ్‌దళ్, ఏబీవీపీ, ప్రముఖులు, విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కోలా ఆనంద్, భరణి కృష్ణ, సుబ్రహ్మణ్యంరెడ్డి, రమణ, బాలసుబ్రహ్మణ్యం, సురేష్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ధర్మకర్త సుశీల్ కుమార్ రెడ్డి, ఎంపీపీ ప్రతిమ

సత్యవేడు: మండలంలోని ఇరుగుళం ఉమామహేశ్వర స్వామి ఆలయంలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్లను ఆలయ ధర్మకర్త కే.సుశీల్ కుమార్ రెడ్డి, ఎంపీపీ వి.ప్రతిమ ఆవిష్కరించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యులు, శివభక్తులతో కలసి ఈ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 25, 26, 27 తేదీల్లో మహాశివరాత్రి వేడుకలు నిర్వహిస్తామన్నారు. 25న నందీశ్వరునికి ప్రదోష పూజ, గణపతి పూజ, అంకురార్పణ, ధ్వజారోహ ణం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే ఈ నెల 26వ తేదీన శివపార్వతుల కల్యాణోత్సవం, గ్రామోత్సవం, అభిషేకాలు, 27న శాంతి అభిషేకం, ధ్వజావరోహణం, మంగళహారతి, అన్నదానం కార్యక్రమలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం కరుణాకర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, కే. శ్రీరామచంద్రారెడ్డి, ఎస్‌కే. బాబురెడ్డి, సోమశేఖర్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, బి. శ్రీధర్, డి. దయాకర్ రెడ్డి, బి. శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

వరదయ్యపాళెం: బస్సులో ప్రయాణిస్తూ ఓ వ్యక్తి గుండెపోటు రావడంతో మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి బస్టాండ్ నుంచి చెన్నైకు బుధవారం శ్రీకాళహస్తి డిపో బయలుదేరింది. అందులో శ్రీకాళహస్తి మండలం మాధవమాల గ్రామానికి చెందిన అయ్యప్ప(45) తడకు వెళ్లేందుకు ఎక్కాడు. అయితే బీఎన్‌కండ్రిగ మండలం కారణిమిట్ట వద్దకు బస్సు చేరుకోగానే ప్రయాణికుడు అయ్యప్పకు గుండెపోటు వచ్చింది. దీంతో బస్సు కండక్టర్, ప్రయాణికుల చొరవతో 108కు సమాచారం అందించారు. ఇంతలో తడకు చెందిన 108 వాహన సిబ్బంది బస్సు వద్దకు చేరుకుని గుండెపోటు వచ్చిన అయ్యప్పను వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే అయ్యప్ప మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, మృతదేహాన్ని అప్పగించారు.